# గోదారమ్మ-4

ఒక క్షణం బొమ్మలా నిలబడిపోయింది. తర్వాత ఆశ్చర్యం నుండి తేరుకుని పెట్టెను సరిగా సర్ది, గది అంతా శుభ్రంగా తుడిచి బయటకు వచ్చేసింది.

ఎవరినో కలిసి ఏదో సలహా ఇచ్చి వచ్చిన గోదారమ్మ వైపు తేరిపార చూస్తూ సీత అడిగింది. "మీరు... మీరు బాగా బతికిన వాళ్ళనిపిస్తోంది. ఇం... త చిన్న ఇంటిలో... ఏ వసతులూ లేని నా ఇంటిలో ఉండటం మీకు చాలా ఇబ్బందిగా లేదూ...?"

ఆవిడ నిట్టూర్చింది. "సీతా... నేను హడావుడిగా వెళ్ళాను అనుకున్నాను. నా పెట్టె చూసావా...?" అని ప్రశ్నించింది, ఏమీ జవాబు చెప్పకుండానే.

సీతకు ఓ క్షణం ఏం చెప్పాలో తోచలేదు. మౌనంగా అవునన్నట్లు తలవూపింది.

గోదావరమ్మ చెంగుతో చెమటను తుడుచుకుంది.

అక్కడున్న కుర్చీలో కూర్చుంటూ చెప్పింది. "సీతా... ఆ మధ్య నువ్వోమాట చెప్పావు, నా దగ్గరున్న డబ్బును జాగ్రత్తపరచుకోకుండా ఖర్చు పెట్టేయవద్దని. అది మంచి మాటేననుకో...! కానీ... ఉద్యోగస్తులకు పెన్షన్ ఎలా ఉంటుందో, అలా నేనూ ఇంట్లో చేసిన పనికి పెన్షను ఏర్పాటు చేసుకుని తెచ్చుకున్నాను. అది అవసరమైనంత, నాకు నచ్చిన విధంగా ఖర్చు పెట్టుకుంటున్నాను.

బాగా బ్రతికిన మీరు ఈ ఇంట్లో ఎలా ఉండగలుగుతున్నారని నీకు సందేహం వచ్చింది కదూ...? ఇంట్లో ఎన్ని గదులున్నా... ఒక్క దానిలోనేగా మనం పడుకోగలం... అవునా...? ఎన్ని వంటకాలు చేసుకున్నా... మన పొట్ట పట్టినంత పిడికెడేగా తినగలం...? ఇది ఎవరైనా కాదనగలరా...?

డబ్బు ఉంటే... చాలా సౌకర్యాలు వస్తాయి... ధీమా, ధైర్యం ఉంటాయి. ఈ విషయమూ ఎవరం కాదనలేం... కానీ సీతా... ఆనందం అనేది మాత్రం మన మనస్తత్వాన్ని బట్టే ఉంటుందమ్మా...!

ఒక్క మాట మాత్రం నేను చెప్పగలను! నాకు నా మనస్తతత్వాన్ని బట్టి... మనుష్యులందరికీ దూరంగా, ఉన్నతస్థాయిలో ఎత్తున ఉండటం నచ్చదు! చాలా సాధారణంగా, మనుష్యులకి బాగా దగ్గరిగా వారిలో కలిసిపోయి ఒకరుగా ఉండటమే బావుంటుంది! అందుకే ఈ ఒంటరి బతుకు...ఇంతకంటె ఇపుడు

నా గురించి ఎక్కువ చెప్పలేను... వివరంగా తర్వాత ఎప్పుడైనా మాత్రం తప్పక చెబుతాను...! సరేనా " అని అనగానే సీత కూడా ఇంక రెట్టించకుండా చిరునవ్వు నవ్వి అంగీకారంగా తలూపింది.

ఒక రోజు...

కుముదను తీసుకుని వచ్చిన వర్మ కాసేపటి తర్వాత తమ ఇంటికి బయలుదేరి వెళ్ళాక... తన దగ్గరకు వచ్చి కూర్చున్న సీతను గోదావరమ్మ అడిగింది.. "రంగా ఏం చేస్తున్నాడూ....? చదువుకుంటున్నాడా...?"

అవునన్నట్లుగా సీత తలవూపింది.

గోదావరమ్మ మళ్ళీ అంది "రంగా, కుముద ఇద్దరూ బాగా స్నేహంగా, కలివిడిగా ఉంటున్నారు కదూ...?"

సీతకి వెంటనే ఉత్సాహం వచ్చింది. "అవునమ్మా... వాళ్ళిద్దరూ బాగా కలిసిపోయారు. కుముద కొంచెం పెద్దది, అంతేగా! అయినా ఎంతో పెద్దదానిలా రంగాని చేరదీస్తూ ఏవేవో సుద్దులు చెబుతూంటుంది! మంచి పిల్ల... మీరన్నట్లుగా తన గొంతు ఎంత బావుంటుందో... పాట పాడుతూంటే అలా అలా వినాలనే ఉంటుంది...!"

గోదారమ్మ అవునన్నట్లు నవ్వు మొహంతో తలవూపింది.

"నాకు... వర్మనీ, నిన్నూ కూడా చూస్తుంటే... చాలా బావుంటుంది! చక్కగా ఇద్దరికీ బాగా కుదురుతుందనిపిస్తుంది! నీ ఆలోచన... అదే... వర్మ గురించి నీ అభిప్రాయం... చెబితే, అతనితోనూ మాట్లాడదామనిపిస్తోంది! ఏమంటావు సీతా...?"

ఆ మాటలకు సీత నిర్విణ్ణురాలైనట్లుగా చూస్తూ "ఏమిటమ్మా... ఏమంటున్నారు.. దేని గురించి అతనితో మాట్లాడతారూ..? మీ మాటలు నాకు... కొంచెం అయోమయంగా ఉన్నాయి...!" అంది.

గోదావరమ్మ చిరునవ్వు నవ్వింది.

"ఏమిటి సీతా... ఇందులో అంత అర్థంకానిది ఏముందీ...? రంగా తండ్రి ఈ భూమ్మీదే లేడని నువ్వేగా నాకు చెప్పావు...! అంటే... అతను చనిపోయినట్లేగా...! మరి... ఇంక నీకు అభ్యంతరం దేనికీ...?

మీ అమ్మగారు కూడా నిన్ను రెండో పెళ్ళికి ఒప్పించమనే అర్థంతోనే ఆ రోజు నాతో అలా చెప్పారనిపించింది! నీది చాలా చిన్న వయసు. ఈ రోజుల్లో మళ్ళీ పెళ్ళి చేసుకోవటం అనేది చాలా మామూలు విషయమే! పైగా వర్మ కూడా చాలా మంచి అబ్బాయిలా కనుపిస్తున్నాడు. రంగా పట్ల కూడా చాలా ఆదరంగా ఉంటున్నాడు. అతనికి నీ విషయాలన్నీ తెలిసే ఉంటాయి! నువ్వంటే కూడా వర్మకు ఇష్టమని నాకనిపించింది! అందుకే... అసలు ఈ ఉద్దేశ్యంతోనే గుడిలో పరిచయం అయిన అతనిని ఇక్కడికి పిలిచి నీకు పరిచయం చేసాను! అతనిది ఎంత మంచి మనసు కాకపోతే, అన్న- వదిన యాక్సిడెంట్ లో చనిపోతే, అన్నకూతురిని స్వంత కూతురిలా ఎంత జాగ్రత్తగా చూసుకుంటున్నాడో చూడు. అలాంటి మంచి అబ్బాయి... మీ ఇద్దరికీ తోడుగా ఉంటే, జీవితం బావుండదూ...? ఆలోచించు...!"

గోదారమ్మ మాటలకు సీత నిట్టూర్చింది.

"అమ్మా... మా అమ్మ ఉద్దేశాన్ని మీరు బాగానే గ్రహించారు! రంగాను తను చూసుకుంటుందట. అందుకని నన్ను పెళ్ళిచేసుకుని వెళ్ళమంటుంది. ఈ ఉద్యోగం చేయడం మా అమ్మకు సుతరామూ ఇష్టంలేదు. కానీ... నాకేమో చిన్నదైనా, పెద్దదైనా ఉద్యోగం చేసి ఆర్థికంగా నిలబడి, స్వతంత్రంగా బ్రతకాలని ఉంటుంది! అందుకే మా ఊరుకు, మా వాళ్ళకు దూరంగా వచ్చేసాను."

"ఇలా చేయటం నా అభిప్రాయంలో చాలా మంచిపని. కానీ... మీ అమ్మగారి మాటల్లోనూ కొంత నిజముంది. ఆలోచించు.. ఉద్యోగం చేస్తూ బ్రతికితే మాత్రం... పెళ్ళిని వద్దనుకోవటం ఎందుకు...? మనిషి తోడు ఉండటం ఇంకా బావుంటుంది కదా... రంగానూ స్వంత బిడ్డలా అభిమానించి ఆదరించే వాళ్ళు దొరక్కపోరు!... రామచంద్రను చూస్తుంటే... అలాంటి మనిషేనని నాకనిపించింది. చూడు... అన్న వదినలు ఏక్సిడెంట్ లో చనిపోతే, వాళ్ళ పిల్లను బాధ్యతగానే కాదు...ఎంత బాగా చూసుకుంటున్నాడో....!"

గోదారమ్మ మాటలను అంగీకరిస్తున్నట్లుగా తలవూపిన సీత నెమ్మదిగా అంది.

"అమ్మా....వర్మ గురించి మీ అభిప్రాయం చాలా నిజం. అలాంటి వ్యక్తులు అరుదుగానే ఉంటారు...కాకపోతే..నా విషయం, నా పరిస్థితి..మానసిక స్థితీ మీకు తెలీదు. రేపు తీరుబడిగా ఉన్నపుడు నా గురించి అన్ని విషయాలూ వివరంగా మీకు చెబుతానమ్మా...!" అని చెప్పి సీత లోపలకి వెళ్ళిపోయింది.

గోదారమ్మ ఆలోచనలో పడింది.

‘ఏం చెబుతుంది సీత...? రంగా తండ్రి ఏ అనారోగ్యంతో ఎలా చనిపోయాడో చెబుతుందా...? ఆ జ్ఞాపకాలతో, తండ్రి లేని పిల్లాడిని పెంచటమే ధ్యేయంగా బ్రతకాలనుకుంటోందా...? అతను లేకపోవటంతో సీత మానసిక పరిస్థితే తలకిందులై పోయిందా ? మరి ఇక తన అభిప్రాయం, ఆలోచన నెరవేరుతాయా...?’

ఈ ఆలోచనలతో సతమతమవుతున్న ఆవిడకు అపుడొక విషయం గుర్తుకువచ్చింది. అంతకుముందు ఒకసారి కుముద తనని అడిగింది ‘‘అమ్మమ్మా... నాకు వంట చేయటం నేర్పవూ...?’ అని.

అపుడు తను ఆశ్చర్యంగా ‘‘ఇంత చిన్నపిల్లవు... నువ్వెందుకు నేర్చుకోవాలను కుంటున్నావమ్మా... పెద్దదానివైతే అదే వస్తూందిలే. ఈ వయసులో బాగా చదువుకోవాలి. ఆపైన భగవంతుడు నీకు మంచి కంఠం ఇచ్చాడు... సంగీతం నేర్చుకుంటున్నావుగా, అదే శ్రద్ధగా నేర్చుకో..’’ అని తను సలహా ఇచ్చింది.

‘‘నేను క్లాసులో పాఠాలు బాగా శ్రద్ధగానే వింటున్నానమ్మమ్మా. రోజు బాగా ప్రొద్దున్నే బాబాయ్ నిద్రలేపి సంగీతం క్లాసులకి పంపిస్తాడా... ఏ రోజు నేను బద్ధకించి మానేయకుండా, వెళ్ళనని అనకుండా వెళ్ళి నేర్చుకుంటున్నాను.

అయితే... ఉదయం అంతా ఒక్కడ్ కిందామీదా పడుతూ ఆఫీసు టైము వరకూ బాబాయ్ వంటచేసి మా ఇద్దరికీ లంచ్ బాక్సులు రెడీ చేస్తాడు. సాయంకాలం రాగానే మళ్ళీ వంట చేస్తూంటాడు. నాకూ వస్తే, సాయంకాలం పూట అయినా నేను చేస్తానుగా...?’’

ఆ మాటలకు గోదావరమ్మ చలించిపోయింది.

అంత చిన్నపిల్ల ఎంత బాధ్యతగా మాట్లాడుతోందీ అని మురిసిపోయి కుముదను దగ్గరకు తీసుకుంది. ‘‘నువ్వు ముందు సీతపిన్ని వెనకే తిరుగుతూ, చేసే పనులు చూస్తూండు, అలా చూస్తూంటే, నువ్వే కొంతకాలానికి చేయగలుగుతావు...!’’ అని చెప్పింది.

సీతను ‘పిన్నీ’ అని పిలవమని తనే సలహా ఇచ్చింది.

సెలవుల సమయాల్లో కుముదను తీసుకుని వచ్చి వర్మ 'ఏమైనా కావాలా' అని సీతను అగడటం, పిల్లల్ని బయటతిప్పి తీసుకు రావటం చేసే రోజుల్లో గోదారమ్మే ఒకసారి అంది ''మీరిద్దరూ ఇంటికి వెళ్ళి విడిగా వండుకుని తినే బదులు, మాతో పాటే ఇక్కడే అదేదో కానిచ్చేస్తే బావుంటుందిగా!'' అని.

ఆ మాటలకు వర్మ ఆనందంగా అంగీకరిస్తూన్నట్లు తలవూపుతూ '' వంట చేసుకునే శ్రమ తప్పుతుందని కాదుగానీ, మీతో కలిసి తినటమనేది చాలా ఆనందకరమైన విషయం కాబట్టి కాదనాలనిపించట్లేదు" అంటూనే సీత వైపు సందేహంగా చూసాడు.

అతని జవాబు సీతకీ, గోదారమ్మకీ నచ్చింది. సీత కళ్ళల్లో అంగీకారాన్ని చూసాక అతను కూడా ఆనందంగా ఫీలయ్యాడు.

పిల్లలైతే హుషారుగా పళ్ళాలు అవీ తెచ్చి ఒకచోట పెట్టడం లాంటి పనులు చకాచకా చేసేసారు! అప్పటినుండీ అదే పద్ధతి జరుగుతోంది.

గోదారమ్మ మనసులో 'సీత, రామచంద్ర ఒక ఇంటివాళ్ళయితే బావుంటుందనే' ఆలోచనతోనే అప్పుడు అలా చేసింది. ఇపుడు అందుకే సీతతో ఆ విషయం కదిపింది.

ఆ మరునాడు సీత చెప్పిన విషయాలను విని గోదారమ్మ నిర్ఘాంతపోయింది. ఆమె ఆశ్చర్యానికి అంతులేదు! ఆ గోదారి కన్నా లోతైన సీత అంతరంగం ఆమెను అబ్బురపరిచింది.

సీత ఇలా చెప్పింది.....

మేం ఇద్దరం అక్కచెల్లెళ్ళం. మా అక్క పేరు భూదేవి. నేను 'దేవక్కా' అని పిలిచేదాన్ని. మా అక్క పేరుకు తగ్గట్లే ఉండేది. మా అమ్మకూడా అక్క గురించి ఎవరికైనా చెప్పేటప్పుడు భలే మురిసిపోతూండేది! 'మా పెద్దమ్మాయి భలే నిదానంగా, పద్ధతిగా ఉంటుంది. చిన్నదానిలా అల్లరిపిల్ల కాదు. నిజంగా వజ్రమే... అన్ని పనులూ వచ్చు. నాకెంత సాయంగా ఉంటుందో...!' అని.

ఆ మాటలు ముమ్మాటికీ నిజమే. నాకూ అమ్మ అలా అనటం చాలా ఇష్టంగా ఉండేది! మానాన్న స్కూల్లో మాష్టరుగా చేసేవారు. కొద్దిపాటి వ్యవసాయమూ ఉంది. నాన్న ఇంటికి రాగానే మంచి నీళ్ళు లాంటివి అందించే పని మా అక్కదే. మా నాన్న కూడా సంతోషంతో 'నా కూతురు బంగారు తల్లి...ఎవరింటికి వెళ్తుందో, అక్కడంతా ఆనందమే...!' అనేవారు.

నేనొకసారి అన్నాను 'అలా మన ఆనందాన్ని ఎవరింటికో పంపటం ఎందుకు నాన్నా, మనదగ్గరే ఉంచేసుకోవచ్చుగా...!' అని.

నా మాటలకు నవ్వుతూనే 'అవేం మాటలే' అని అమ్మా నాన్నా కూడా కోప్పడ్డారు. అందులో అంత తప్పేం ఉందో అప్పుడు నాకు అర్థం కాలేదు.

అక్క హైస్కూలు చదువు పూర్తిచేసి  ఇంట్లోనే ఉంటోంది.

పక్కవూళ్ళో హైస్కూలులో మాష్టారుగా కొత్తగా జాయినైన అబ్బాయితో నాన్న అక్కకి సంబంధం మాట్లాడారట... అమ్మకి చెప్పారు ఆ వివరాలు.

ఆ రోజు సాయంకాలం అబ్బాయి వచ్చి ఒక్కడూ అమ్మాయిని చూస్తాడని చెప్పారు. అబ్బాయికి అంగీకారం అయితే, అపుడు అతని అమ్మానాన్నలు, పెద్దలూ వచ్చి అన్ని విషయాలూ మాట్లాడుతారట. అమ్మాయి నచ్చితే కట్నకానుకల విషయంలో అస్సలు పట్టింపు లేదట అని నాన్న మొహం ఇంతచేసుకుని చెప్పారు. ఆమాట అందరికీ ఆనందం కలిగించింది. అక్క నచ్చకపోవటమేనేదే ఉండదని కూడా అనుకున్నారు.

ఆ సాయంకాలం బడి వదిలాక పుస్తకాల సంచీ వూపుకుంటూ వస్తోంటే, 'ఈ వీధిలో రంగనాధంగారిల్లు ఏదో మీకు తెలుసా... చెబుతారా...?' అని సైకిలు మీద వస్తున్న ఒకతను అడిగేసరికి నేను ఆగి... అతన్ని చాలా పరీక్షగా చూసి 'మీ పేరు... విశాల్రావా...?' అనడిగాను హడావుడిగా.

అతను కొంచెం ఆశ్చర్యంగా, అయోమయంగా చూసి ''అవును. నా పేరు మీకెలా తెలుసూ..?'' అనడిగాడు.

'రంగనాధంగారు మా నాన్నగారేనండీ. మా ఇంటిగురించి నన్నే వాకబు చేసారు. మీరు మా అక్కను చూడటానికి వస్తున్నారని నాకు తెలుసుగా...' అని జవాబు చెప్పా.

అతన్ని ఆపాదమస్తకం ఓసారి పరికించి చూసి 'బాగానే ఉన్నారు. పాస్ మార్కులు ఇవ్వొచ్చు...' అన్నా సరదాగా.

అతను ఫక్కున నవ్వాడు.  'పాస్ మార్కులేనా... ఫస్టు మార్కులు కాదా....?'

ఆమాటకి నేనూ నవ్వాను. ‘మా అక్కకి ఫస్టు మార్కులు వేస్తారు ఎవరైనా. మీరు తన మనసును గెలుచుకోగలిగితే మీకూ ఫస్టు మార్కులు వచ్చినట్లే....!’ అన్నాను మళ్ళీ సరదాగా.

‘అలాగా... చూద్దాం...!’ అంటూ అతనూ సరదాగా నవ్వాడు. ‘ఇదే మా ఇల్లు’ అంటూ అతనికి చెప్పి ‘అమ్మా... ఎవరొచ్చారో చూడూ... పెళ్ళి కొడుకుని నేనే తీసుకువచ్చానూ’ అని అరిచా.

అమ్మా... నాన్నా ఇద్దరూ గుమ్మం దగ్గరకు వచ్చి ‘రా... బాబూ..’ అంటూ అతన్ని లోపలకు ఆహ్వానించి కూర్చోబెట్టారు.

నేను లోపలకు పరుగెత్తి అక్క దగ్గరకు వెళ్ళి ‘అక్కా... ముందుగా నేనే బావను చూసాను. పాస్ మార్కులు కూడా వేసేశాను!’ ఉత్సాహంగా చెప్పాను.